



జాగరణ..!

- వారం నుంచి పని చేయని సర్వర్
- స్తంభించిన పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు
- కర్నూలు యార్డులో పేరుకుపోయిన ఉల్లి
- అమ్మకాల కోసం రైతుల ఎదురుచూపులు





కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతన్నకు ఇబ్బందులు తప్పడం లేదు. వారం రోజులుగా సర్వర్ పని చేయకపోవడంతో మార్కెట్లలో క్రయవిక్రయాలు ఆగిపోయాయి. దీంతో రైతులు తమ పంట ఉత్పత్తులతో మార్కెట్లలో జాగరణ చేయాల్సిన పరిస్థితి దాపురించింది. కర్నూలు మార్కెట్ యార్డులో అయితే ఉల్లిగడ్డ గుట్టలుగా పేరుకుపోయింది. వాహనాలు రోడ్డుపై వరకు బారులుదీరి కనిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడు కొనుగోలు చేస్తారా అని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు భూషన్న. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో తనకున్న ఎకరా పొలంలో ఉల్లి సాగు చేశాడు. 80 ప్యాకెట్ల ఉల్లిని మంగళవారం కర్నూలు యార్డుకు తీసుకు వచ్చాడు. అయితే.. సర్వర్ సమస్య కారణంగా ఉల్లి విక్రయాలు ఆలస్యమవుతాయని అధికారులు చెప్పడంతో తప్పదన్నట్లుగా మూడు రోజుల పాటు యార్డులోనే జాగరణ చేస్తున్నాడు. గోరు చుట్టుపై రోకటి పోటులా శుక్రవారం ఆఫ్‌లైన్‌లో కూడా విక్రయాలు చేయలేమని, మరో మూడు రోజులు ఆగాల్సిందేనని అధికారులు చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నాడు. ప్రస్తుతం యార్డులో లక్షన్నర బస్తాల ఉల్లిగడ్డలు గుట్టల్లా పేరుకుపోయాయి. వీటన్నింటిని ఏవిధంగా అమ్మాలో దిక్కుతోచక అధికారులు లబోదిబోమంటుంటే.. వందలాది మంది అన్నదాతలకు మాత్రం పడిగాపులు తప్పడం లేదు.

మిగతా 8లో..

న్యూస్ బాక్స్

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించండి : మంత్రి బీసీ



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం అధికారులను ఆదేశించారు. బనగానపల్లె పట్టణంలోని ఏపీ ఎస్పీ డీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా సుధాకర్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

నంద్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శుక్రవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలోని ఆయా విభాగాల్లో పనిచేస్తున్న మొత్తం 13మంది సిబ్బంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై ఎస్పీ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

శ్రీశైలానికి భారీగా ఇన్‌ఫ్లో

- రెండు గేట్ల ఎత్తివేత
- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

శ్రీశైలం, అక్టోబరు 25: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద భారీగా కొనసాగుతోంది. శుక్రవారం డ్యాం అధికారులు 2 క్రస్టుగేట్లు 10 అడుగులమేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి నీరు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 63,176 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 63,105 క్యూసెక్కులు మొత్తం 1,26,281 వరద నీరు చేరింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 1,32,406 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తి స్థాయి నీటిమట్టం 884.60 అడుగులకు చేరింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీ.ఎమ్.సీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 213.4011 టీ.ఎమ్.సీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,406 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,600 క్యూసెక్కులు నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. జలాశయం రెండు క్రస్టుగేట్ల ద్వారా 55,782 క్యూసెక్కుల నీరు దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

బీఈడీ ఐసీటీ పేపరు లీక్

నిలిచిపోయిన పరీక్షలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష పేపర్ లీక్ అయింది. శుక్రవారం ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నికల్ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు గదిలోకి వెళ్లారు.. టెక్నికల్ సమస్యతో పరీక్ష వాయిదా వేస్తున్నామంటూ ప్రకటించడంతో విద్యార్థులు కేంద్రాల నుంచి వెనుదిరిగారు. 2023-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 23 నుంచి 28 వరకు బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని సర్క్యులర్ జారీ అయింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో గురువారం జరగాల్సిన పరీక్షా సమయంలో శుక్రవారం నాటి పేపర్‌ను విద్యార్థులకు చేరవేశారు. విద్యార్థులు ఇన్విజిలేటర్‌కు విషయం తెలియజేయడంతో వెంటనే వాటిని వెనక్కి తీసుకున్నారు. పరీక్షల విభాగం కంట్రోలర్‌కు విషయం తెలియడంతో పరీక్షలను నిలిపివేశారు. పరీక్ష కేంద్రాన్ని రద్దు చేసి తరుపరి చర్యలు తీసుకుంటామని ఆర్‌యూ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు తెలిపారు.

తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం

కలెక్టర్ రాజకుమారి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రం, జైన్ ఇరిగేషన్ పరిశ్రమలను ఆమె ఎమ్మెల్యే జయసూర్యతో కలసి సందర్శించారు. తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలోని జైన్ పరిశ్రమ, అంబుజా, సీడ్ పార్కుకు ఎన్ని ఎకరాలు కేటాయించారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం క్షేత్రంలో ఎన్ని ఎకరాల్లో ఏఏ పంటలు ఉత్పత్తి చేస్తూ రైతులకు గ్రామ విత్తన ప్రోగ్రాం ద్వారా అందిస్తున్నారనే విషయాలను అడిగారు. ప్రస్తుతం 215 ఎకరాల్లో కమిషనర్ కార్యాలయం ఆదేశాల మేరకు కంది సాగు చేస్తున్నామని ఏడీఏ అరుణ లత తెలిపారు. సీడ్ పార్కుకు ఇచ్చిన పొలాలు బీడుగా మారాయని, క్షేత్రంలో ఉన్న భూములు కూడా కంప చెట్లతో నిండిపోయాయని, ఈ విషయాన్ని వ్యవసాయ కమిషనర్ కార్యాలయానికి నివేదిక అందజేశామని ఏడీఏ చెప్పారు. దీంతో తమ దృష్టికి ఎప్పుడైనా తీసుకొచ్చారా, కలెక్టర్ కార్యాలయానికి నివేదిక పంపించారా అని అడగగా ఏడీఏ లేదని చెప్పారు. దీంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జైన్ పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడారు. జూపాడుబంగ్లాలో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని 80బన్నూరు, కొత్తసిద్ధేశ్వరం గ్రామాల గిరిజనులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసు, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ, పీఆర్‌ఏఈ బషీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు యాదవ్, మహేశ్వరరెడ్డి, జైన్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవుకు రిజర్వాయర్‌ను పట్టించుకోండి

- భారీగా కోతకు గురైన మట్టి కట్టలు
- అధికారుల పర్యవేక్షణ కరువు



భారీగా కోతకు గురైన రిజర్వాయర్ మట్టికట్ట

అవుకు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, కడప జిల్లాలకు అవుకు రిజర్వాయర్ వరప్రసాదిని. పాలేరు చెరువు, గొల్లలేరు, తిమ్మరాజు చెరువులను కలుపుతూ 4.148 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం జరిగింది. రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీ ద్వారా ఈ రెండు జిల్లాల్లోని 42,509 ఎకరాలకు సాగు నీరు, పలు గ్రామాలకు తాగునీరు అందిస్తోంది. అలాగే అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని 50 గ్రామాలకు కమ్యూనిటీ ప్రాజెక్టు వాటర్ సప్లయ్ (సీపీడబ్ల్యూఎస్) స్కీం ద్వారా తాగు నీరు అందుతోంది. కొలిమిగుండ్ల మండలంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రతి రోజూ 25 లక్షల లీటర్ల నీటిని రిజర్వాయర్ నుంచే తరలిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన అవుకు రిజర్వాయర్ నిర్వహణ లోపం స్పష్టంగా కనపడుతోంది. రిజర్వాయర్ నిర్మాణం జరిగి 19 ఏళ్లు కావటం, నిర్వహణ సరిగా లేకపోవటంతో మూడంచెల భద్రతతో నిర్మించిన మట్టికట్టలు వర్షాలకు భారీగా కోతలకు గురవుతున్నాయి. కోతలకు గురవుతున్న మట్టికట్టలను, నీటి లీకేజీలను గుర్తించటానికి వీలులేని విధంగా మట్టికట్ట లు ముళ్లపొదలతో మూసుకుపోయాయి. పాలేరు స్లూయిస్ సమీపంలో రెండో అంచెలో నిర్మించిన మట్టికట్ట 10 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో భారీగా కోతకు గురైంది. ఈ ప్రాంతం మరమత్తుల కోసం రూ.3 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం రిజర్వాయ ర్‌లో ప్రస్తుతం 3.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత నెల 25వతేదీన రిజర్వాయర్ తిమ్మరాజు చెరువు వద్ద 1 మీటరు పొడవు, 1 మీటరు వెడల్పుతో ఎర్రరాతితో నిర్మించిన రివిట్‌మెంట్ కుంగిపోయింది. డ్యాం సేఫ్టీ అధికారులు, జలవనరులశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి నెల రోజుల్లో కుంగిన రివిట్‌మెంట్‌ను సరిచేస్తామని చెప్పి వెళ్లారు. ఇప్పటి వరకు ఆదిశగా చర్యలు లేవు.



ముళ్లపొదలతో మూసుకపోయిన మట్టికట్టలు

త్వరలో మరమ్మతు చేస్తాం



కోతకు గురైన మట్టికట్ట మరమ్మతు పనులు త్వరలో చేపడతాం. ఎస్సార్బీసీ ఉన్నతాధికారులకు రూ. 3లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

-సురేష్‌బాబు, ఎస్సార్బీసీ ఈఈ, అవుకు

పర్యావరణ పరిరక్షణకు కృషి

అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా



అటవీ అధికారులకు శిక్షణ ఇస్తున్న అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా

మహానంది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అడవులు, అందులోని జంతువుల పరిరక్షణకు అటవీ సిబ్బంది, ప్రజలు కృషి చేయాలని అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా అన్నారు. శుక్రవారం మహానంది సమీపంలోని అటవీశాఖ పర్యవరణ విద్యాకేంద్రంలో నంద్యాల, రుద్రవరం, చలమ, అహోబిలం రేంజ్ పరిధిలోని అటవీ అధికారులకు అడవుల సంరక్షణ, ట్రాక్‌ను ఏ విధంగా ఉపయోగించాలనే అంశంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ నుంచి శేషాచలం అడవుల వరకు గ్రీన్ కారిడార్‌గా ప్రకటించినట్లు తెలిపారు. ఇందులో వన్య ప్రాణుల సంచారం అధికంగా ఉండటంతో మానవ సంచారానికి అనుమతి ఇవ్వలేదన్నారు. అక్టోబరు, నవంబర్, డిసెంబర్ నెలల్లో వణ్య ప్రాణులు గర్భం దాల్చే సీజన్ కావడంతో నల్లమల అడవుల్లోకి పర్యాటకులకు అనుమతి లేదన్నారు. పులుల గణనపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అటవీశాఖ సంరక్షకుడు బీవీఏ కృష్ణమూర్తి, రుద్రవరం సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, రేంజ్ ఆఫీసర్లు ఉదయ్‌దీప్, శ్రీపతినాయుడు, డీఆర్వో ముర్తుజావలి, శ్రీనివాస రెడ్డి, నాయక్, కిషోర్, ప్రతాప్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు 8

భర్తను హతమార్చిన భార్య
వివాహేతర సంబంధమే కారణం
ఆత్మకూరు మండలం కృష్ణాపురంలో ఘటన 9

కర్నూలు నగరపాలక సమావేశం రసాభాస



9

వేతన వెతలు

- జీతాల కోసం సుంకేసుల బ్యారేజీ నిర్వహణ సిబ్బంది నిరీక్షణ
- పది నెలలుగా ఎదురు చూపు
- కుటుంబాలు గడవడం లేదని ఆవేదన
- 2009 వరదల్లో డ్యాంను రక్షించారని అప్పట్లో అవార్డులు



నిరసన తెలుపుతున్న సుంకేసుల బ్యారేజీ నిర్వహణ సిబ్బంది

కర్నూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సుంకేసుల బ్యారేజీ నిర్వహణ సిబ్బందికి పది నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. తుంగభద్ర నదిపై కర్నూలు మండలం సుంకేసుల బ్యారేజీ, కర్నూలు-కడప (కేసీ) కాలువను నిర్మించారు. ఈ డ్యాం నుంచి 2,65,628 ఎకరాలకు (ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1,73,627 ఎకరాలు, కడప జిల్లాలో 92,001 ఎకరాలు) సాగునీరు, 259 గ్రామాలకు నీటి ప్రయోజనం చేకూరుతుంది. ఘనమైన చరిత్ర కలిగిన బ్యారేజీ నిర్వహణ అత్యంత కీలకం. 2005 నుంచి 2024 ఫిబ్రవరి వరకు 19 ఏళ్లుగా ముగ్గురు ఎలక్ట్రీషియన్లు, 9 మంది హెల్పర్లు బ్యారేజీ నిర్వహణ కోసం డ్యాం మెయింటెనెన్స్ కాంట్రాక్టరు శ్రీనివాసరెడ్డి వద్ద పని చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్ట్ రద్దు చేయడంతో డ్యాం నిర్వహణ కోసం జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి సిఫారసు కాంట్రాక్ట్ సిబ్బందిని అప్కాస్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తూ 2023 సెప్టెంబరు 14న అప్పటి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్‌కుమార్ జీవో ఆర్‌టీ నంబరు 403 జారీ చేశారు. ఎలక్ట్రీషియన్లకు రూ.18,500, హెల్పర్లకు రూ.15,500 నెల జీతం నిర్ణయించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న కేసీ కెనాల్ నంద్యాల డివిజన్ ఈఈ తిరుమలేశ్వరరెడ్డి, డ్యాం డీఈఈ రఘురామిరెడ్డి, ఏఈఈ ఎం.రాజుకు రిపోర్ట్ చేసి డ్యాం నిర్వహణ విధుల్లో చేరారు. ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించడంతో కష్టాలు తీరుతాయని ఆనందించారు.

మిగతా 8లో..

మంత్రాలయం హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు


హుండీని లెక్కిస్తున్న దృశ్యం

మంత్రాలయం, అక్టోబరు 25.(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,38,02,400 వచ్చింది. 31 రోజులకు సంబంధించిన హుండీలను శుక్రవారం మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.3,38,02,400 నగదుతో పాటు 1.180 కేజీల వెండి, 136 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఈఈ సురేష్ కోణాపూర్, సూపరింటెండెంట్లు అనంత పురాణిక్, రవికులకర్ణి, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, నవీన్, లక్ష్మీకాంత్, గురురాజ్ పాల్గొన్నారు.

కొర్ర సాగు భలే

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ



మద్దికెర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోయిన రైతులు వర్షాధార భూములను సాగు చేయకుండా వదిలేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సైతం కొర్ర పంటను సాగు చేసి కొందరు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో దాదాపు 150 ఎకరాల్లో కొర్ర పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. ఎకరాకు 6 నుంచి 10 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. కొర్ర పంటను సాగు చేసుకోవడానికి రైతులు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటం ధర రూ.3,500 ఉన్నట్లు చెబుతున్నారు. భూములను బీడుగా వదిలేయడం కంటే కొర్ర పంటను సాగు చేస్తే లాభాలు ఆర్జించవచ్చని సూచిస్తున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది కొర్ర పంట ఆశాజనకంగా ఉంది.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



మండల వ్యాప్తంగా దాదాపు 150 ఎకరాల్లో కొర్ర పంటను సాగు చేశారు. ప్రభుత్వాలు చిరుధాన్యాలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. చిరు ధాన్యాలను నూర్పిడి చేసుకోవడానికి ప్రభుత్వం తగిన యంత్రాలను మంజూరు చేయాలి. విక్రయానికి అలాగే మార్కెట్ సౌకర్యం కల్పించాలి.
- వీరేష్, మద్దికెర

కొర్ర పంట బాగుంది



రెండెకరాల్లో కొర్ర పంటను సాగు చేశాను. దిగుబడి ఆశాజనకంగా ఉంది. కొర్రసాగులో పెట్టుబడి కూడా తక్కువే. వేరుశనగ పంటతో పోలిస్తే చాలా తక్కువ. అని పంట మార్పిడి చేస్తే దిగుబడి చాలా వస్తుంది.
- ఎర్రిస్వామి, రైతు, ఎం అగ్రహారం

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహకం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాయి. చిరుధాన్యాలను సాగు చేయడం రైతులకు ఎంతో ఉపయోగకరం. అలాగే అంతర్ పంటలు కూడా సాగు చేయాలి. చిరు ధాన్యాల సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది.
- ఉప్పర రవి, ఏవో

ఆటోలో ఊయల


ఆటోలో టమోటాలు అమ్ముతూ వ్యాపారం చేస్తున్న కావేరి

కోసిగి అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): కోసిగి కుప్పగల్లుకు చెందిన కావేరి అనే బాలింత తన ఐదు నెలల కుమారుడు, భర్తతో కలిసి ఆటోలో టమోటాల వ్యాపారం చేస్తోంది. కుమారుడి కోసం ఆటోలో ఊయలను ఏర్పాటు చేసి ఆలనపాలనా చూసుకుంటోంది. ఓ వైపు బతుకుదెరువు.. మరో వైపు బిడ్డ బాగోగులు రెండు సమపాళ్లలో చూసుకుంటోంది.

యాగంటికి ఆర్కియాలజీ గ్రహణం

- నిధులు ఫుల్ .. అభివృద్ధి నిల్
- సొంత స్థలం లేకపోవడమే సమస్య
- అభివృద్ధి పనులకు ఆర్కియాలజీ శాఖ అడ్డంకి
- వసతులు లేక భక్తుల ఇక్కట్లు


యాగంటి ఆలయం

బనగానపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): : నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. నిధులు నిండుగా ఉన్నా వాటిని ఖర్చు చేయని దుస్థితిలో దేవదాయశాఖ ఉంది. ఆలయం ఆర్కియాలజీ శాఖ పరిధిలో ఉంది. పరిపాలన మాత్రం దేవదాయశాఖ పరిధిలో ఉంది. దీంతో ఏ అభివృద్ధి పని చేయాలన్నా ఆర్కియాలజీ శాఖ అధికారులు అడ్డుపడుతున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో యాగంటి క్షేత్రం

యాగంటి అత్యంత పురాతన క్షేత్రం. పల్లవులు, విజయనగరం రాజుల కాలంలో ఈ ఆలయం నిర్మితమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు యాగంటి ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఎర్రమల కొండల మధ్య ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయం ఉండడం, యాగంటి బసవేశ్వరుడు, అంతకంతకు పెరుగుతుండడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటుంటారు. ఆలయానికి భక్తుల ద్వారా సంవత్సరానికి రూ.కోటికి పైగా ఆదాయం వస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి స్వామి వారిని హుండీని లెక్కిస్తుంటారు. ఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ఆర్కియాలజీ శాఖాధికారులు సహకరించడం లేదన్న విమర్శలున్నాయి. ఆలయాధికారులు, పాలకవర్గం కూడా ఏం చేయలేని దుస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో భక్తులు బస చేయడానికి యాగంటి క్షేత్రానికి సొంత స్థలం లేదు. నిధులున్నా ఆలయానికి సొంత స్థలం లేకపోవడంతో భక్తులకు వసతి కల్పించడానికి దేవదాయశాఖ భవన నిర్మాణం చేపట్టలేకపోతోంది. దీంతో భక్తులు ప్రతి రోజూ ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ సమీపంలో టూరిజం శాఖకు చెందిన 8 గదులు గల కాటేజీ మాత్రమే ఉంది. అలాగే ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి బ్రాహ్మిణి రెసిడెన్సీ మాత్రమే అందుబాటులో ఉంది. ఇవి భక్తులకు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు గదులు లేకపోవడంతో వెనువెంటనే దర్శనం చేసుకొని వెళ్లిపోతున్నారు. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో ఆరుబయటే పండుకొని తెల్లారి వెళ్లిపోతున్నారు. చివరికి యాగంటి ఈవోకు, ఇతర సిబ్బందికి గది కూడా లేదు. ఆలయంలోని ఆర్కియాలజీ శాఖ పరిధిలోని ఓ సత్రంలో ఈవో, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆలయం చుట్టూ ప్రైవేటు వ్యక్తుల భూమి ఉంది. గతంలో పని చేసిన ఆలయ అధికారులు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూమి కొనుగోలు చేసి ఉంటే ఈ కష్టాలు ఉండేవి కావని భక్తులు వాపోతున్నారు.

ఆలయం మెట్లు ఎక్కాలంటే..

వృద్ధులు, చిన్నపిల్లలు ఆలయ దర్శనం చేసుకోవాలంటే మెట్లు ఎక్కలేక ఇబ్బం దులు పడుతున్నారు. ఆలయానికి లిఫ్ట్ సౌకర్యం కావాలని ఆర్కియాలజీ అధికారులకు అనేక సార్లు యాగంటి దేవస్థానం వారు ప్రతిపాదనలు పంపినా అవి బుట్ట దాఖలయ్యాయి. ఆర్కియాలజీ శాఖకు చెందిన కొందరు ఉద్యోగులు, ఆలయ సంరక్షణకు మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ముగ్గురు పని చేస్తున్నారు. వారు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. ఆర్కియాలజీ శాఖ నుంచి దేవదాయశాఖ పరిధిలోకి యాగంటి ఆలయాన్ని తెస్తే అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

వేతన వెతలు

జీతాల కోసం సుంకేసుల బ్యారేజీ నిర్వహణ సిబ్బంది నిరీక్షణ

(7వ పేజీ తరువాయి)

సుంకేసుల బ్యారేజీ నిర్వహణ విధుల్లో చేరిన తమతో డ్యాం డీఈఈ డీఈఈ రఘురామిరెడ్డి, ఏఈఈ ఎం.రాజులు పని చేయించుకున్నారే తప్పా జీతాల బిల్లులు చేయలేదని ఉద్యోగులు వాపోతున్నారు. జీతాలు అడిగితే సీఎఫ్ఎంఎస్ ఐడీ రాలేదంటూ పది నెలలుగా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ మేరకు శనివారం కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డిని కలసి తమ గోడు విన్నవించారు. జీతంపై స్పష్టమైన హామీ రాకపోవడంతో నిరాసతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించుకోవడానికి అప్పులు చేశామని, వాటిని తీర్చలేక అవస్థలు పడుతున్నామని డ్యాం మెయింటేన్స్ వర్కర్లు ఏకరువు పెడుతున్నారు. కనీసం స్కూల్ పిల్లల ఫీజులు కట్టలేని పరిస్థితి ఏర్పడిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇదిలా ఉండగా మొత్తం కార్మికులకు నెలకు రూ.1.95 లక్షలు ప్రకారం పది నెలలకు రూ.19.50 లక్షల వరకు వేతనం బకాయి చెల్లించాల్సి ఉంది. 2009లో అత్యధికంగా 9.25 లక్షల క్యూసెక్కులు వరద వస్తే ప్రాణాలకు తెగించి గేట్లు ఎత్తి బ్యారేజీ కొట్టుకుపోకుండా రక్షిం చారని ఇంజనీర్లు సన్మా నాలు చేశారు. ఇప్పుడేమో జీతాలు ఇవ్వకుండా కడుపు కాలుస్తున్నార నే ఏక రువు పెడుతున్నారు.


జీతాల కోసం కర్నూలు ఇరిగేషన్ ఎస్ఈని అభ్యర్థిస్తున్న బ్యారేజీ నిర్వహణ సిబ్బంది

మా గోడు వినేదెవరు?



డ్యాం నిర్వహణ విధుల్లో 19 ఏళ్లుగా పని చేస్తున్నాం. ఈ ఏడాది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో ఆర్‌టీ నం.403 జారీ చేస్తే కష్టాలు తీరుతాయని ఆనందించాం. సీఎఫ్ఎంఎస్ ఐడీ లేదంటూ జీతాల బిల్లులు పెట్టకుండా అర్థాకలితో పనులు చేయించుకున్నారు. మా గోడు పట్టించుకునేవారెవరు.
- వై.రాములు, సుంకేసుల డ్యాం ఎలక్ట్రీషియన్

అప్పుల పాలయ్యాం



సుంకేసుల డ్యాం ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాను. పది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. నాపైనే భార్య కొడుకు ఆధారపడ్డారు. కుటుంబ పోషణ కోసం అందిన చోటల్లా అప్పులు చేశాను. మీకు జీతాలు ఎప్పుడొస్తాయో.. మా అప్పు ఎప్పుడు తీరుస్తావో.. అంటూ అప్పులు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి. - జి.వీరన్న, ఎలక్ట్రీషియన్

అప్పులు కూడా ఇవ్వట్లేదు



మా ఊరి పక్కనే సుంకేసుల డ్యాం ఉంది. 2009 నుంచి డ్యాం నిర్వహణ హెల్పర్‌గా పని చేస్తున్నాను. 2009లో భారీ వరదలు రావడంతో ప్రాణాలకు తెగించి గేట్లెత్తి డ్యాంను కాపాడాం. అధికారులు సన్మానాలు చేశారు. ఇప్పుడేమో జీతాలు ఇవ్వడం లేదు. అంగట్లో సరుకులు అరువు కూడా ఇవ్వడం లేదు. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. ఇద్దరు పిల్లలు ఇంటర్, పదో తరగతి చదువుతున్నారు.
- వెంకట్రాముడు, డ్యాం హెల్పర్, సుంకేసుల

పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేని పరిస్థితి



డ్యాం హెల్పర్‌గా 2005 నుంచి పని చేస్తున్నాం. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తే కష్టాలు తీరుతాయని ఆనందించాం. పది నెలలుగా మాతో పని చేయించుకున్న ఇంజనీర్లు జీతాలు బిల్లులు కూడా పెట్టకుండా పది నెలలు నుంచి జీతాలు ఇవ్వడం లేదు. నాకు ఇద్దరు పిల్లలు. ఇంటర్, 9వ తరగతి చదువుతున్నారు. జీతాలు రాకపోవడంతో స్కూల్ ఫీజులు కూడా కట్టలేని పరిస్థితి ఉంది.
- వి.శేఖర్‌రెడ్డి, హెల్పర్, సుంకేసుల

కందిలో పురుగును నివారించుకోవాలి

పంటలను పరిశీలించిన ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు


కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు సుజాత, గిరీష్

గోనెగండ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కంది, వేరుశనగ పంటలకు పచ్చ పురుగు, లద్దె పురుగు, మారాకు మచ్చల పురుగు సోకినట్లు ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు సుజాత, డీఆర్‌సీ ఏడీఏ గిరిష్, ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలో కంది, వేరుశనగ పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంది, వేరుశనగ పంటలను సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. పురుగు ఉధృతిని బట్టి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో కంది, వేరుశనగ పంటల్లో ఈ పురుగు చాల వరకు సోకిందని అన్నారు. కందిలో ఈగ నివారణకు థయాక్లోప్రిడ్ 0.7 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పచ్చ పురుగును అరికట్టడానికి స్పీనోసాడ్ 0.3 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే వేరుశనగ లద్దె పురుగుకు ఏమామెక్టిన్ బెంజోఏట్ 0.3 గ్రాముల బెల్లం రెండు శాతం కలుపుకొని పిచికారి చేయాలన్నారు. అలాగే నియోజకవర్గంలో పెసర, మినుము, చిక్కుడు, వేరుశనగ జిలుగు వంటి పంటలకు కూడా పురుగు ఆశించిందన్నారు. కాసిన కాయల్లోకి పురుగు వెళ్లి గింజలను పూర్తిగా తినివేస్తాయని తెలిపారు. నివారణకు వేపనూనె 3 మిల్లీ లీటర్లకు ఒక లీటర్ నీటిని కలుపు కొని పిచికారి చేసుకోవాలన్నారు. తరువాత పురుగు గమనిస్తే ఏమమేక్టిన్ బెంజోఏట్ 0.3గ్రాములు లేదా నోవాలురాన్ ఒక మిల్లీ లీటరును ఒక లీటరు నీటిలో కలుపుకొని రెండు శాతం బెల్లం ద్రావణంలో కలిపి పిచికారి చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు మహేంద్ర, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

జాగరణ..!



(7వ పేజీ తరువాయి)

కర్నూలు మార్కెట్ యార్డు చరిత్రలో ప్రస్తుత పరిస్థితులు గతంలో ఎప్పుడూ ఎదుర్కోలేదు. వారం రోజులుగా సర్వర్ మొరాయించడంతో పంట ఉత్పత్తుల విక్రయాలు ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు నిలిపివేయాల్సి వచ్చింది. ఫలితంగా ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో రైతన్నలు నాలుగు రోజులుగా జాగరణ చేస్తున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ యార్డుల్లో రోజుకు వేల టన్నుల పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం తదితర 16 రకాల పంట ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయి. ఆయా మార్కెట్ యార్డులకు 2.10 లక్షల బస్తాల ఉత్పత్తులు వచ్చాయి. విక్రయాలు జరగకపోవడంతో రైతులు నాలుగు రోజులుగా యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఉల్లిగడ్డల వాహనాలు బారులుదీరడంతో రెండు రోజులుగా ఆఫ్‌లైన్‌లో వేలాలను నిర్వహించారు. ఉల్లిగడ్డ ఉత్పత్తులు భారీగా రావడంతో అధికారులు ఈ విధానంలో కూడా విక్రయాలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డులో దాదాపు 1.50 లక్షల బస్తాల ఉల్లిగడ్డలు పేరుకుపోయాయి.



సర్వర్ సమస్య తీరేదెన్నడో..?


సర్వర్ పని చేయక.. వివిధ పంట ఉత్పత్తులు అమ్ముకునే అవకాశం లేక పండగ పూట రైతన్నలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. రైతులకు అప్పులు ఇచ్చిన వారు తాము చెప్పిన ధరకు ఉంట విక్రయించాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారు. ఒకేసారి సమస్యలు చుట్టుముట్టడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో మూడు రోజులుగా తమ పంటల ఉత్పత్తుల విక్రయాల కోసం ఎదురుచూస్తున్నారు.

విధిలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నాం

కర్నూలు మార్కెట్ యార్డులో వేల టన్నుల ఉల్లి విక్రయాలు నిలిచిపోయాయి. సర్వర్ సమస్య కారణంగా రెండు రోజులపాటు ఆఫ్ లైన్‌లో విక్రయాలు జరిపి రైతుల ఇబ్బందులను కొంత వరకు తీర్చగలిగాం. సర్వర్ సమస్య తొందరలోనే తొలగిపోయే అవకాశం ఉంది. ఉల్లితో పాటు మిగతా పంట ఉత్పత్తులను వెంట వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం. రైతులు అర్థం చేసుకుని సహకరించాలి.
- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ


ప్రకృతి ఒడిలో ప్రయాణం

పచ్చని చెట్ల మధ్య నంద్యాల - గిద్దలూరు రహదారి



నంద్యాల - ప్రకాశం జిల్లాల మధ్య సరిహద్దులో ఆకుపచ్చని అందాల మధ్య రైలు పట్టాలు




బ్రిటీషు వారు నిర్మించిన రైల్వే వంతెన దిమ్మెలు


నల్లమల అడవి

రుద్రవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాల మధ్య ప్రయాణం.. పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ సాగే పయనం.. నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే ప్రతి ఒక్కరికీ కలిగే అనుభూతి ఇది. పచ్చని అందాలకు నల్లమల అడవి కేరాఫ్ అన్న విషయం అందరికీ తెలిసిందే. ఎత్తయిన కొండలు లోతైన లోయలు, పచ్చని వృక్షాలు, ఒంపు సొంపుల రహదారులు, పక్షుల కిలకిలరావాలు, రకరకాల వన్యప్రాణుల మధ్య సాగే ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పచ్చని తోరణాలతో 20 కి.మీ. మేర అడవిలో ప్రయాణం సాగుతుంది. అలాగే వందల ఏళ్ల క్రితం బ్రిటీషు వారు నిర్మించిన రైల్వే వంతెనను కూల్చి వేసినా అందుకోసం నిర్మించిన దిమ్మెలు నేటికీ పదిలంగా ఉన్నాయి. ఎత్తయిన కొండల మధ్య పచ్చని వృక్షాల నడుమ రైల్వే పట్టాలు ఉన్నాయి. అటు రైల్వే ప్రయాణికులు, ఇటు రోడ్డు ప్రయాణికులను పచ్చదనం అందాలు కట్టిపడేస్తున్నాయి.


నల్లమలలో రోడ్డు మార్గం


నల్లమలలో రైల్వే లైన్

కబ్జాలు.. అవినీతిపై రచ్చ

- రసాభాసగా నగర పాలక సమావేశం
- బాహాబాహీకి దిగిన కార్పొరేటర్లు
- అవినీతిపై విచారణకు మంత్రి టీజీ భరత్ ఆదేశం



నగర పాలక సమావేశంలో తోసుకుంటున్న కార్పొరేటర్లు

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో జరిగిన అవినీతి అక్రమాలపై వైసీపీ, టీడీపీ కార్పొరేటర్లు బాహాబాహీకి దిగారు. 'నీవెంత అంటే..నీవెంత అని' చిత్రం వచ్చినట్లు అరుచుకున్నారు. ఒక దశలో ఇరువర్గాలు కొట్టుకుంటారనే భయంతో కొందరు బయటికి వెళ్లారు. దీంతో మేయర్ సమావేశాన్ని పది నిమిషాలు వాయిదా వేశారు. ఆ సమయంలో అత్యవసర పని ఉండటంతో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ బయటికి వెళ్లిపోయారు. మూడేళ్ల కాలంలో నగరంలో అనేక భూకబ్జాలు జరిగాయని, వాటిపై తక్షణమే విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. శుక్రవారం సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగుతున్న రెండో కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖల మంత్రి టీజీ భరత్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. మొట్టమొదటిసారిగా కౌన్సిల్ సమావేశానికి హాజరైన మంత్రి టీజీ భరత్‌ను నగర మేయర్, కమిషనర్ రవీంద్రబాబు సన్మానించారు. సమావేశంలో ఏడు అజెండాలకు ఆమోదం తెలిపారు. నగర పాలక సాధారణ నిధుల నుంచి రూ.1.90 కోట్లు అభివృద్ధి పనులు ఖర్చు చేయడానికి పాలకవర్గం పచ్చజెండా ఊపింది. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎస్ఈ రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, అధికారులు, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సీ క్యాంపులో బంకుల ఏర్పాటుపై రగడ..

నగరంలోని సి. క్యాంపు ప్రభుత్వ పాఠశాలకు ఆనుకుని బంకులు వేయడంపై వైసీపీ, టీడీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. శ్రీరాంనగర్ కార్పొరేటర్ కటారి పల్లవి బంకులను తొలగించాలని సభ దృష్టికి తీసుకువచ్చింది. దానిని టీడీపీ నాయకులే వేసారని...పాఠశాలలో బాలికల మరుగుదొడ్లను ఆనుకుని బంకులు వేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. దీంతో వైసీపీ కార్పొరేటర్లు కొందరు మేము కూడా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి బంకులు ఏర్పాటు చేసుకుంటామని ఖరాఖండిగా చెప్పేసారు. దీంతో టీడీపీ కార్పొరేటర్ పరమేష్ కలగజేసుకుని మామిదాలపాడు నుంచి జమ్మిచెట్టు వరకు రింగ్ రోడ్డు నిర్మాణం ఆగిపోయిందన్నారు. కేవలం మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తుంగభద్రను కబ్జా చేయడంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయిందన్నారు. ఇంతలో వైసీపీ నుంచి నాగలక్ష్మీరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, క్రిష్ణకాంత్‌రెడ్డితో పాటు పలువురు కబ్జా చేసి ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. ఇంతలో టీడీపీ కార్పొరేటర్లు క్రాంతికుమార్, పరమేష్ ఆగ్రహంతో ఊగిపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో కబ్జాలు జరిగాయని, వాటిని పోలిస్తే ఇదేమీ పెద్దది కాదని అన్నారు. అవసరమైతే సి.క్యాంపులోని బంకులపై కూడా విచారణకు సహకరిస్తామన్నారు. అయితే వైసీపీ కార్పొరేటర్లు కావాలనే సమావేశం జరగకుండా మధ్యలో రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ క్రమంలో క్రాంతి కుమార్, యూనుస్‌ల మధ్య తోపులాట జరిగింది. ఇంతలో మరికొందరు కార్పొరేటర్లు కలగజేసుకుని వారిద్దరిని పక్కకి తప్పించారు. బిర్లా గేట్ వద్ద ఉన్న చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద మామూళ్లు వసూలు చేసిన సంగతి తమకందరికి తెలుసునని క్రాంతికుమార్ అన్నారు.

తాగునీటి సరఫరాపై ఆవేదన

నగర పాలక పరిధిలోని శివారు కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని 41వ వార్డు విష్ణుటౌన్ షిప్, లక్ష్మీపురం, క్రిష్ణానగర్, శరీన్‌నగర్, పెద్దపాడు, ఎస్టేట్, తదితర శివారు కాలనీలలో ప్రతి రోజు నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు.



మాట్లాడుతున్న మేయర్



అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

నగర పాలక సంస్థలోని వాటర్ వర్క్స్, సుంకేసుల నుంచి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు వరకు చేపడుతున్న పైప్‌లైన్లలో జరిగిన అవినీతిపై విజిలెన్సు విచారణకు ఆదేశిస్తున్నాం. ప్రతి కౌన్సిల్ సమావేశంలో మినిట్స్ బుక్ మెయిన్‌టెయిన్ చేయండి. కమ్యూనిటీ హాల్స్‌ను పునరుద్ధరించాలి. నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాము. **- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి**



విజిలెన్స్ విచారణకు ఆదేశించాలి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలి. కల్లూరు పరిధిలోని 16 పార్కులను కబ్జా చేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడంతోపాటు కొందరిని బెదిరించారు. **- గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే**



తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది

కోడుమూరు నియోజకవర్గం 38,39,40 వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించాలి. **- బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఎమ్మెల్యే**

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం : రాజశేఖర్, ఎస్ఈ

నగర పాలక పరిధిలోని అన్ని వార్డులకు ప్రతి రోజూ నీరు సరఫరా చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటాం. ప్రత్యేకంగా సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుతో పాటు కాలనీలలో ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకులను నిర్మిస్తాం.



స్మార్ట్ సిటీగా మార్చాలని సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి

నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చాలని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. **- ఎస్. రవీంద్రబాబు, కమిషనర్**

అటవీ భూమిపై వివాదం

- ఆక్రమణలను అడ్డుకున్న అటవీ అధికారులు



అటవీ అధికారులతో మిలిటరీ కాలనీ వాసుల వాగ్వాదం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులోని గార్గేయపురం నగర వనానికి ఆనుకొని ఉన్న అటవీ శాఖ భూమిపై వివాదం నెలకొంది. రిజర్వు ఫారెస్టుగా ఉన్న భూమిలో ఓ వ్యక్తి ఏకంగా రహదారి నిర్మాణానికి పూనుకో వడంతో శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత తలెత్తింది. నగర వనానికి ఆనుకొని ఉన్న స్థలాన్ని 1891లో అటవీ శాఖకు కేటాయించినట్లు గెజిట్ నోటిఫికేషన్ చూపుతోంది. అయితే 1955లో విశ్రాంత సైనిక ఉద్యోగులకు ఒక్కొక్కరికి ఏడు ఎకరాల చొప్పున కేటాయించి రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే మిలటరీ కాలనీకి చెందిన కొందరు అటవీ భూముల్లో రహదారి నిర్మాణానికి పునుకున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు గురువారం అక్కడికి చేరుకొని తమ పరిధిగా చెప్పుకునే ప్రాంతం వరకు సరిహద్దు స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే మిలిటరీ కాలనీకి చెందిన కొందరు పెద్దఎత్తున శుక్రవారం అక్కడకు చేరుకుని ఆ రాళ్లను తొలగించారు. విషయం అటవీ శాఖ అధికారులకు తెలియడంతో అప్రమత్తమై రెవెన్యూ, జలవనరులు, పోలీసు శాఖలకు సమాచారం ఇచ్చారు. పోలీసు భద్రత నడుమ రెవెన్యూ శాఖకు సంబంధించిన డిప్యూటీ సర్వేయర్, జలవనరుల శాఖ నుంచి సహాయ ఇంజనీరు అక్కడికి చేరుకున్నారు. ఎవరైనా తమ పరిధిలోకి వస్తే చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే తమ పరిధిలోకి చొరబడిన వారిపై పోలీసు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.



స్థానికులు తొలగించిన సరిహద్దు రాళ్లు

స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను అందుబాటులోకి తెస్తాం

- మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సేవలను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం ఉదయం క్యాన్సర్ హాస్పిటల్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలిసి పరిశీలించారు. పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.సీఎస్‌కే ప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనం తరం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పెరిగిన రోగుల సంఖ్యను బట్టి పోస్టులను భర్తీ చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.



ఆసుపత్రిలో పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి భరత్

పొదల్లో మృతదేహం

నందికొట్కూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని పొదల్లో కుక్కలు పీక్కుతింటుండగా దారిన వెళుతున్న రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటన శుక్రవారం నందికొట్కూరు సంతమార్కెట్ పక్కనే ఉన్న పొలాల దారిలో జరిగింది. పోలీసులు పరిశీలించగా అక్కడ స్విచ్‌ఆఫ్ చేసిన సెల్‌ఫోన్, పురుగుల మందు డబ్బా లభ్యమయ్యాయి. దీంతో సెల్‌ఫోన్‌ను ఆన్ చేసి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడు కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు (45)గా గుర్తించారు. శ్రీనివాసులు ప్రతి సోమవారం సంతకు వచ్చి పొటేళ్ల మారుబేరం చేస్తూ జీవించేవాడు. గత సోమవారం ఉదయం నందికొట్కూరు సంతకు వచ్చాడని, ఆ రోజు సాయంత్రం వరకు ఫోన్ పని చేసిందని ఆ తర్వాత స్విచ్ ఆఫ్ అయ్యిందని అన్నారు. వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లి వ్యక్తి ఇంటికి వస్తాడని అనుకొన్నామని శ్రీనివాసులు కుమారులు విలపించారు. శ్రీనివాసులుకు అప్పులు ఉన్నాయని ఆ బాధతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. మృతుడికి భార్య శ్రీదేవి, కుమారులు పరశురాముడు, మల్లికార్జున ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శ్రీనివాసులు(ఫైల్)

మట్టిమిద్దె కూలి మహిళ మృతి

బనగానపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని సంకలాపురం గ్రామానికి చెందిన రాజంరెడ్డి రామసుబ్బారెడ్డి భార్య (40) ఉమామహేశ్వరమ్మ మట్టిమిద్దె కూలి మృతి చెందింది. ఆ ఘటన శుక్రవారం జరిగింది. మధ్యాహ్నం ఇంట్లో ఉండగా ఇటీవల కురిసిన వర్షానికి మట్టిమిద్దె ఒక్కసారిగా కూలిపోయింది. పైకప్పు పడడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. భర్త రామసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎద్దుల బండి బోల్తా.. రైతు మృతి

ఆస్పరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడగొండ గ్రామంలో వ్యవసాయ పనుల నిమిత్తం ఉరుకుందప్ప పొలం పనులకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఎద్దుల బండి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఉరుకుం దప్ప(45) మృతి చెందాడు. మృతుడికి భార్య వరలక్ష్మితోపాటు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ ఇంటిల్లిపాది శోకసంద్రంలో మునిగిపోయింది. సర్పంచ్ ఆంజనేయులు యాదవ్ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఉరుకుందప్ప (ఫైల్)

భర్తను హతమార్చిన భార్య

ఆత్మకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భర్తను భార్య హతమార్చిన ఘటన ఆత్మకూరు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కృష్ణాపురం గ్రామానికి చెందిన చిట్యాల ఆదిరామిరెడ్డి (35) అనే వ్యక్తితో 16 ఏళ్ల క్రితం ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం మండలం గల గంజివారిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి వివాహం జరిగింది. వీరికి చరణ్‌కుమార్‌రెడ్డి (12), హైమావతి (11) సంతానం. చిట్యాల ఆదిరామిరెడ్డి మరో మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగించడంపై కొన్నేళ్లుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం కూడా భార్యాభర్తలు గొడవ పడుతుండగా బంధువులు వచ్చి సర్ది చెప్పారు. మధ్యాహ్నం నుంచి ఇంటికి తాళంవేసి ఉండటంతో అనుమానం వచ్చి ఇరుగు పొరుగు వారు సాయంత్రం ఇంట్లోకి తొంగి చూశారు. దీంతో ఆదిరామిరెడ్డి మంచంలో శవమై కనిపించాడు. మృతుడి బంధువులు పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు ఓబులేసు, సురేష్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లక్ష్మీదేవి తన భర్తను బలమైన ఆయుధంతో హతమార్చి పిల్లలతో సహా ఇంటి నుంచి పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు మృతుడి మామ భాస్కరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.



ఆదిరామిరెడ్డి (ఫైల్)


మైనార్టీల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం కాల్వ గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీల ఆహ్వానం మేరకు కాల్వ గ్రామానికి చేరుకుని ముస్లింలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఉన్న మసీదు నిర్మాణం నిలిచిపోయిందని, నిధులు కేటాయించాలని ముస్లింలు రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే రాష్ట్ర ముస్లిం మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో ఫోన్‌లో ముస్లింలతో మాట్లాడించారు. మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చామని మల్లెల తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 బాలబాలికల అథ్లెటిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. కర్నూలులో 50 సంవత్సరాల నుంచి క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామని, భవిష్యత్తులోనూ సహాయ సహకారాలు ఉంటాయని టీజీ వెంకటేశ్ హామీ ఇచ్చారు. ఆర్‌ఐపీఈ భానుమూర్తి మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం సహాయం ఉంటుందన్నారు. 2 శాతం స్పోర్ట్స్ కోటాను ఉద్యోగంలో వినియోగించుకోవాలని ఆయన క్రీడాకారులకు సూచించారు. డీవీఈవో పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ కర్నూలులో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడలు నిర్వహించడం హర్షణీయమన్నారు. అతిథులు 13 జిల్లాల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 900 మంది బాలబాలికలు హాజరయ్యారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, హర్షవర్ధన్, ప్రిన్సిపాల్ సుంకన్న, క్రీడాదాత న్యాయవాది శ్రీధర్ రెడ్డి, వివిధ జిల్లాల కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులు కాపాడతాం

- చైర్మన్ మహమ్మద్ ఇబ్రహీం

కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుతామని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహమ్మద్ ఇబ్రహీం అన్నారు. శుక్రవారం నగరంలోని వక్ఫ్‌బోర్డు కాంప్లెక్స్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల ద్వారా మైనార్టీల ప్రయోజనాల కోసం ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేద ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని తెలిపారు. జిల్లాలో ముస్లింలకు టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు గౌస్ రబ్బాని, షేక్ రమీజ్ బాషా, షేక్ మహబూబ్,షేక్ అబ్దుల్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ ఇబ్రహీం

బాలుడి అదృశ్యం

- హంద్రీలో గల్లంతయ్యాడని అనుమానం

దేవనకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పొలం గట్టున ఉన్న దివ్యాంగుడైన బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని అలారుదిన్నెలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన నర్సన్న, సోమేశ్వరి దంపతులకు ఏడేళ్ల కూతురు శ్రావణ, ఐదేళ్ల కుమారుడు మహేష్ ఉన్నారు. మహేష్ పుట్టుకతో దివ్యాంగుడు. రోజుమాదిరిగానే బాలుడిని తల్లిదండ్రులు పొలానికి తీసుకెళ్లారు. పొలం గట్టున బాలుడు సెల్‌ఫోన్ చూస్తూ ఉండగా.. తల్లిదం డ్రులు పత్తి తీసే పనుల్లో నిమగ్నమయ్యారు. పదినిమిషాల తరువాత బాలుడు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా మహేష్ ఆచూకీ కనపడలేదు. పొలం పక్కనే ఉన్న హంద్రీలో పడిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. దేవనకొండ పోలీసులు, గ్రామస్తులు హంద్రీ పరిసర ప్రాంతంలో చీకటి పడేంతవరకు వెతికినా బాలుడి అచూకీ లభ్యం కాలేదు.



మహేష్ (ఫైల్)

మెరుగైన వైద్యం అందించాలి: డీఎంహెచ్‌వో

కొత్తపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆదివాసులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ అక్కడి వైద్యులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కొత్తపల్లి మండలంలోని గోకవరం, ఎర్రమటం పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి రోజువారి ఓపీని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఎర్రమటం గూడెం,, శివపురం గూడెం, గుమ్మడాపురం గ్రామాలను సందర్శించారు. కొత్తపల్లి, ఎర్రమటం వైద్యాధికారులు మహ్మద్ బేగ్, జుబేర్ ఉన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన

పాణ్యం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక తపాలా కార్యాలయం వద్ద శుక్రవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎంప్లాయిస్, ఆలిండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తపాలా కార్యాలయం వద్ద తమ డిమాండ్లు నెరవేర్చాలని నిరసన చేపట్టారు. పోస్టుమాస్టర్ సుధీర్ మాట్లాడుతూ వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ శేఖర్, ఉద్యోగులు షహింషా, ఫయాజ్ బాష, ప్రియాంక, మహిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం


రగ్బీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పాణ్యం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభించారు. గ్రామీణం నుంచి ఒలింపిక్స్‌కు బాలికలు ఎదగాలని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, అస్మిత రగ్బీ లీగ్ క్రీడలను ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి, కాంపిటీషన్ మేనేజరు వికాస్ చౌరాసియా స్పోర్ట్స్ అథారిటీ పరిశీలకులు చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, పీడీలు వెంకటేశ్, చంద్రారెడ్డి, నాయక్, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే: పాణ్యం మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న రగ్బీ సబ్‌జూనియర్ పోటీలలో మొదటి స్థానం ఆళ్లగడ్డ ఆర్పీ గురుకుల పాఠశాల సాధించినట్లు రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం జరిగిన పోటీలలో ద్వితీయ స్థానం లక్ష్మాపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల, మూడవ స్థానం ఆళ్లగడ్డ రెగ్యులర్ ఏపీఎస్ డబ్ల్యు ఆర్ పాఠశాల సాధించిందని చెప్పారు. విజేతలకు రూ. 50 వేలు, రూ, 30 వేలు, రూ. 20 వేలు నగదు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ రాజు, ని మ్మకాయల సుధాకర్, ఏపి రెడ్డి, పాల్గొన్నారు.

పశుగణన పోస్టరు ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పశుగణన పోస్టర్‌ను న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పశువుల గణాంకాల సేకరణకు వచ్చే సిబ్బందికి పశుపోషకులు సహకరించాలని పిలుపు నిచ్చారు. సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరారు. పశుసంవర్ధకశాఖ డాక్టర్లు గోవింద్‌నాయక్, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: పాడి రైతులు పశుగణనకు సహకరించాలని ఎంపీడీవో వాసుదేవగుప్తా, పశువైద్యాధికారి సాయిహరిణి సూచించారు. అఖిల భారత పశుగణన కార్యక్రమం సందర్భంగా శుక్రవారం వారు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పాములపాడు: మండలంలో పశుగణన చేపట్టినట్లు పశు వైద్యాధికారి అనిల్ తెలపారు. పాములపాడులో సర్పంచ్ భాగ్యమ్మ చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభించారు. చెలిమిళ్ళ, రుద్రవరం, జూటూరు, తుమ్మలూరు, పాములపాడు గ్రామాలకు సూపర్‌వైజర్‌లను నియమించామని, ఈ కార్యక్రమం ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తామని పశు వైద్యాధికారి తెలిపారు.

'లింగ నిర్ధారణ చేస్తే చర్యలు'

ఆత్మకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ, భ్రూణహత్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంతారావు నాయక్, ఆత్మకూరు అర్బన్ సీఐ ఓబులేసు హెచ్చరిం చారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు సబ్ డివిజనల్ మల్టీ మెంటర్ అప్రాప్రియేట్ అథారిటీ, సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వయిజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సూపరిన్‌డెంట్ డాక్టర్ రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ మస్తానయ్య, పీసీపీఎన్‌డీ ఆర్గనైజర్ మద్దిలేటి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, ఎన్‌జీవో ప్రతినిధి జుల్ఫీకర్ అలిఖాన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు

బండిఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నారపురెడ్డి కుంట చెంచు కాలనీలో విద్యుత్ దీపాలను అమర్చారు. శనివారం మండలంలోని చిన్నదేవళాపురం మజరా నారపురెడ్డికుంటలో ఎంపీడీవో దస్తగిరి, ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ రామకృష్ణవేణి దగ్గరుండి విద్యుత్ దీఈపాల అమరిక చేపట్టారు. అనంతరం గిరిజన ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. చిన్న దేవళాపురంలో ఆధార్ సీడింగ్‌ను వారు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

'ఆధునిక వ్యవసాయంతో రైతులకు లాభం'

వెలుగోడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయంతో రైతులకు ఎంతో లాభమని మండల వ్యవసాయ శాఖ అధికారి పవన్‌కుమార్ తెలిపారు శుక్రవారం మండలంలోని గుంతకందాల గ్రామంలో ఆధునిక వ్యవసాయం, డ్రోన్‌ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది అఫ్సర్‌అలీ, అర్పుత్, రామకృష్ణ, వెంకటశివ, రామలక్ష్మి, స్వర్ణ, ప్రసన్న రైతులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నంద్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు స్కూళ్లలో విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

'భూ సమస్యల పరిష్కారానికి కృషి'

గడివేముల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు అన్నారు. కరిమద్దెలలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మసీదుపురంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవి, డీటీ కామేశ్వరరెడ్డి, టీడీపీ నాయకుడు నరాల చంద్ర మౌళీశ్వరరెడ్డి, వీఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు.

మిడుతూరు: చింతలపల్లిలో గ్రామ సభ నిర్వహించారు. తహసిల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజ, ఈవోఆర్డీ సంజన్న, ఆర్ఐ జహంగీర్ బాష, మండల సర్వేయర్ కృష్ణుడు, ఆఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపులలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఉపతహసీల్దార్ నాగన్న, టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలం లోని పిన్నాపురంలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ రత్నరాధిక, సర్పంచ్ మహానంది గంగాదేవి, టీడీపీ నాయకులు రాజేంద్రారెడ్డి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

వెలుగోడు: గుంతకందాలలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ వెంకటరామిరెడ్డి, సర్వెయర్ ఉపేంద్ర, వీఆర్వో జబీవుల్లా పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్ర నామార్చన పూజలు నిర్వహించి మంగళహరతులను సమర్పించారు. శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

వరి పంటను పరిశీలించిన జపాన్ బృందం

బండిఆత్మకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్నపాడు గ్రామ మజరా మణికంఠపురం గ్రామంలో ఐరన్ కోటెడ్ వరి పంట సాగును జపాన్ బృందం పరిశీలించింది. శుక్రవారం భారత వరి పరిశోధన సంస్థ ఐఐఆర్ ప్రతినిధులు వెంకటన్న ఆధ్వర్యంలో జపాన్ ప్రతినిధులు ప్రకాశ్ తివారి, కాజు మిచ్చి శశి మణికంఠపురంలో రైతులు ధనుంజయరెడ్డి, శ్రీనివాసరెడ్డి సాగు చేసిన ఐరన్ కోటింగ్ వరి పంటను పరిశీలించారు. పెట్టుబడి, వాతావరణ అనుకూలతలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

'టీటీడీ నిధులతో అభివృద్ధి పనులు'

మహానంది, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ఆలయాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం రూ.25 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు టీటీడీ ఏఈ ఎం. లక్ష్మీపతి తెలిపారు. శుక్రవారం మహానంది క్షేత్ర పరిధిలో టీటీడీ నిధులతో నిర్మాణంలో ఉన్న డార్మెంటరీ పనులను ఏఈ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని నంద్యాల, యాగంటి, ఉడుములపాడు, ఎస్ గుండాల, మహానందిల్లో టీటీడీ నిధులతో వసతి గృహాలు, కల్యాణమంటపాలతో పాటు సీతారామపురంలో రాజగోపురాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. వీటిలో కొన్ని మరో మూడు నెలల్లో పూర్తి దశకు వస్తాయన్నారు. త్వరలో అహోబిలం క్షేత్రంలో రూ. 3 కోట్ల టీటీడీ నిధులతో డార్మెటరీ పనులను టెండర్లు పిలిచి ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు. మహానంది దేవస్థానం ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులుయాదవ్, కాంట్రాక్టర్లు శ్రీనివాసులు, వెంకటరమణ, జయరాం పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక

గడివేముల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గని హైస్కూల్‌కు చెందిన మౌనిక జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఇమామ్‌వలి తెలిపారు. నంద్యాల పట్టణంలోని మున్సిపాల్ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో మౌనిక ఉత్తమ ప్రతిభ కనబరిచిందని అన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మౌనికను హైస్కూల్ హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'

మిడుతూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. శుక్రవారం మిడుతూరు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ వార్షిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో బాగంగా స్టేషన్ రికార్డులు, కేసులకు సంబంధించిన సీడీ ఫైల్‌లు ఆయన పరిశీలించారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ ఓబులేసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నందికొట్కూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి వైవీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల యజమానులకు పలు సూచనలు చేశారు. స్టాక్ రిజిస్ట్రార్‌లో బస్తాల పరంగా కాకుండా స్టాక్ మొత్తం మెట్రిక్ టన్నుల్లో పొందుపరచాలని సూచించారు. ప్రతి పథకం అందే విధంగా పని చేయాలని వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, ఏవో షేక్షావళి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక సాంద్ర విధానంతో పత్తిపంటలో అధికదిగుబడులు సాధించవచ్చని మురళీకృష్ణ అన్నారు. మండలంలోని తర్తూరు గ్రామంలో పత్తిసాగుపై క్షేత్రదినోత్సవ కార్యక్రమం యాగంటిపల్లి కృషివిజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో శ్రీధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, రవిగౌడు, నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, వ్యవసాయఅధికారి కృష్ణారెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'జీవితాన్ని నాశనం చేసుకోవద్దు'

గడివేముల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంతో కోపాలు పెంచుకొని జీవితాలు నాశనం చేసుకోవద్దని ఫ్యాక్షన్ జోన్ సీఐ పార్థసారధి సూచించారు. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన పెసరవాయిలో శుక్రవారం ఆయన ప్రజలతో సమావేశమయ్యారు. పెసరవాయిలోని ఫ్యాక్షన్‌పై ఎస్ఐ నాగార్జున్‌రెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కక్షలు, ఘర్షణల వల్ల జీవితాలు సర్వనాశనం అవుతాయని అన్నారు. ప్రజలు ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవితం గడపాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైన అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

'యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీద్దాం'

ఆత్మకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడాభారతి తరుపున అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు ఆ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీశైలం జగద్గురుమఠం నందు క్రీడాభారతి ఆత్మకూరు సబ్‌డివిజన్ కమిటీల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం క్రీడాభారతి ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ బిజ్జం సుబ్బారెడ్డి, ఆత్మకూరు తాలుకా అధ్యక్షుడిగా గుణంపల్లి పురుషోత్తంరెడ్డి, నందికొట్కూరు తాలుకా అధ్యక్షునిగా శ్రీధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాభారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రామకృష్ణ విద్యా సంస్థ అధినేత రామకృష్ణారెడ్డిని ఆత్మకూరు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు 'వెలాసిటి' విద్యార్థి


షాహిద్‌ను అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

నంద్యాల కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నంద్యాల నందిపైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఎస్‌జీఎఫ్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టీమ్ సెలక్షన్స్ గురువారం నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో నంద్యాల వెలాసిటి జూనియర్ కాలేజికి చెందిన ఎస్ షాహిద్ పాల్గొని రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టీమ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. శుక్రవారం వెలాసిటి జూనియర్ కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించడానికి కళాశాల తగిన ప్రోత్సాహం అందిస్తుందన్నారు. విద్యార్థులు వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని మంచి పురోగతిని సాధించాలని కోరారు.కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వంశీచైతన్య, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గురుమోహన్, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించండి

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశుగణన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ కోరారు. శుక్రవారం పశుగణన కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రవీంద్రారెడ్డి, దీపకుమారి, వీఏ కోటయ్య, సిబ్బంది, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

శిరివెళ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. కర్నూలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఆమె బదిలీపై యర్రగుంట్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె , అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో రైతులు పురుగుల మందులు పిచికారి చేస్తే సమయంలో అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కటికవానికుంట గ్రామంలో కందిపంట వేసిన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారి ప్రవీన్‌కుమార్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

ప్యాపిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశాన్ని నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ శ్రీరామిరెడ్డి, డిప్యూటీ ఎంపీపీ నాగేశ్వరమ్మ, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, పీఆర్‌ఏఈ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ మెంబర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటామని ఆ పార్టీ నాయకుడు భార్గవ్ రామ్ నాయుడు అన్నారు. ఆళ్లగడ్డ మండల పరిధిలోని ఓబులం పల్లెకి చెందిన టీడీపీ కార్యకర్త ఉప్పు గౌబుషా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూలమాల వేసి శుక్రవారం నివాళి అర్పించారు. మండలంలోని పలువురు టీడీపీ నాయకులు గౌబుసా మృతికి నివాళి అర్పించారు.

నీటి కుంటలా రహదారి

- ఇబ్బందుల్లో ప్రజలు
- మురుగు కాల్వలను నిర్మించాలని వేడుకోలు


చాగలమర్రి ముత్యాలపాడు బస్టాండులో నీటి కుంటలా రహదారి

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీల్లో ప్రధానంగా మురుగు రహదారుల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాగలమర్రిలో 20 వార్డులు, 32 వేల మంది జనాభా ఉన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ప్రధాన రహదారులపైనే మురుగు ప్రవహిస్తోంది. కాలువలు సరిగా లేక ప్రధాన రహదారులపైనే మురుగు నీటికుంటలను తలపిస్తున్నాయి. ముత్యాలపాడు బస్టాండు పరిసరాల్లో నిత్యం రహదారిపైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో దోమల బెడద అధికమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మురుగు నీటిలోనే వాహనదారులు,


చాగలమర్రి రహదారిలో పడేసిన చెత్తా చెదారం

విద్యార్థులు, కూలీలు రాక పోకలు చేయాల్సి ఉంది. ముక్కున వేలేసు కొని మురుగు నీటిలో నడవాల్సి వస్తోంది. చెత్తాచెదారం రహదారులపైనే పడేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలపైన అక్రమ కట్టడాలు ఉండటంతో మురుగు నీరు ప్రవహించేందుకు వీలు లేక రహదారిపై పొంగి ప్రవహిస్తోంది. ఆయా కాలనీ ప్రజలు వ్యాధుల బారీన పడి అల్లాడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువలు శుభ్రపరిచి అక్రమ కట్టడాలు తొలగింపచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఈవో తాహిర్ హుసేన్‌ను వివరణ కోరగా చాగలమర్రి మేజర్ పంచాయతీ పరిధిలో కాలువల సమస్య పరిష్కరించేందుకు దాదాపు రూ.30 లక్షలతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. నిధులు మంజూరు చేస్తే వెంటనే పనులు చేపట్టి మురుగు నీరు ప్రవహించకుండా కాలువలు నిర్మించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా శనగ సాగు

- ఏడీఏ సుధాకర్



కొలిమిగుండ్ల, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): రబీ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో పప్పు శనగ సాగు చేస్తారని ఏడీఏ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : డివిజన్‌లో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో పప్పు శనగ సాగు చేస్తారు..?

జవాబు : కోవెలకుంట్ల డివిజన్‌లోని కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, అవుకు, దొర్నిపాడు, ఉయ్యాలవాడ ఆరు మండలాల్లో 1,04332 ఎకరాల విస్తీర్ణంలో ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా శనగ సాగు చేశారు.

ప్ర: సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ చేశారా?

జ: 6883మంది రైతులకు 12038 క్వింటాళ్లు సబ్సిడీ శనగ విత్తనాలు రైతు సేవా కేద్రాల ద్వారా అందిస్తున్నాం.

ప్ర: పప్పు శనగ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి ..?

జవాబు : సాగు సమయంలో విత్తన శుద్ధి అత్యంత కీలకం. అదేవిధంగా భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా శనగ సాగు చేయాలి. ఎరువులు తగిన మోతాదులో వాడాలి

ప్ర: అధిక వర్షపాతం సంభవిస్తే పంటను ఎలా కాపాడుకోవాలి..?

జ: పంట సాగు తరువాత అధిక వర్షపాతం సంభవిస్తే, పొలంలో నీరు నిల్వ ఉండకుండా కాలువ ఏర్పాటు చేసుకొని బయటకు తరలించాలి. ఉన్న నీరు కూడా ఆవిరి కావడానికి, హెక్టారుకు 20కేజీల యూరియా చల్లితే నీటిని పీల్చి వేస్తుంది. తద్వారా పంటకు ఉపశమనం కలుగుతుంది. రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండే వ్యవసాయ సిబ్బంది సలహాలు పాటించాలి.

బుగ్గన వాకింగ్‌కు వస్తున్నాడని..!

మున్సిపల్ కార్యాలయం గేటుకు తాళం


మున్సిపల్ కార్యాలయం గేటు బయట ఉన్న మాజీ మంత్రి బుగ్గన

డోన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్‌లో విచిత్రమైన పరిస్థితి ఎదుర్కొన్నాడు. శుక్రవారం ఉదయం మాజీ మంత్రి బుగ్గన వాకింగ్‌కు వస్తున్నాడని తెలిసి మున్సిపల్ కార్యాలయం గేటుకు తాళం వేసేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రహదారిలో ఉన్న మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వాకింగ్ ట్రాక్ ఉంది. మాజీ మంత్రి బుగ్గన, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డితోపాటు తన అనుచరులతో కలిసి వా కింగ్ చేయడానికి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే మాజీ మంత్రి బుగ్గనకు అక్కడ చేదు అనుభవం ఎదురైంది. మున్సిపల్ కార్యాలయం గేటుకు తాళం వేసి ఉండడం చూసి బుగ్గన నివ్వెరపోయారు. మున్సిపల్ కమిషనర్‌తోపాటు అధికారులు, సిబ్బందికి ఫోన్లు చేసి గేటు తాళం తీయించేందుకు మున్సిపల్ చైర్మన్ రాజేష్ ప్రయత్నాలు చేశారు. అయితే మున్సిపల్ అధికారుల ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో బుగ్గన గేటు బయటనే ఉండిపోవాల్సి వచ్చింది. అక్కడే కొద్దిసేపు కూర్చుని వాకింగ్ చేయకుండానే బుగ్గన వెళ్లిపోయారు. మున్సిపల్ కార్యాలయంలో తాను ఉండి నిర్మించిన వాకింగ్ ట్రాక్‌లో తనకు వాకింగ్ చేయడానికి అనుమతి లేదా అంటూ మాజీ మంత్రి బుగ్గన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ అధికారులు తమ పద్ధతి మార్చుకోవాలని, తాను వాకింగ్‌కు వస్తున్నానని చెప్పి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు.

డోన్‌లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలి

ప్యాపిలి: డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండలంలోని రామరత్నగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, శ్యాంరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భువనేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, అలేబాదు బాలయ్య బోరెడ్డి రాము, రజని కాంత్ రెడ్డి, ఆనంద్, విఘ్నేశ్వరరెడ్డి, తులసిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు రూ.9 కోట్లు : ఏడీఈ

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలు రూ.9 కోట్లు ఉన్నాయని విద్యుత్‌శాఖ ఏడీఈ రవికాంత్‌చౌదరి తెలిపారు. శుక్రవారం చాగలమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యుత్ లైన్‌మెన్‌లు, సిబ్బందిచే సమావేశం నిర్వహించారు. ఏడీఈ మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్ తొలగిస్తామని అన్నారు. వ్యవసాయ పరిధిలో రూ.10 లక్షలు బకాయిలు ఉన్నాయని అన్నారు. మండలంలో రూ.12 కోట్లు బకాయిలు ఉన్నాయని అన్నారు. వ్యవసాయం కింద ఎస్సీ ఎస్టీలకు రూ.10 లక్షలు ఉన్నాయని తెలిపారు. చాగలమర్రి మండలంలో రూ.2 కోట్లు ఖర్చు చేసి 16 కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని అన్నారు. విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నా మని అన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ షాజ హాన్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

వాసవీ మాతకు విశేష పూజలు

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. మహన్యాస రుద్రాభిషేకం, జల, పాలాభిషేకాలు చేశారు. మహిళలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. వెండి రథంలో అమ్మవారి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

చౌడేశ్వరీమాత ఆలయంలో..

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీమాత పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డి,పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య ఏర్పాటు చేసిన సమావేశానికి ఇందిరమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం బనగాపల్లెలో నిషేధించి, ప్లాస్టిక్‌రహిత బనగానపల్లెగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి సం రక్షించాలని అన్నారు. అలాగే వ్యాపారులు బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. టంగుటూరు శ్రీనయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి చెట్లు పెంపకానికి పాటు పడాలని కోరారు. సమావేశంలో పట్టణంలో వ్యాపారులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతుల్లో ధైర్యం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కొలిమిగుండ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో రైతుల్లో ధైర్యం వచ్చిందని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో జరిగిన రెవెన్యూ గ్రామ సభలో వీఆర్ లక్ష్మీరెడ్డితో పాటు, తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి, మండల సర్వేయర్ సరిత, గ్రామ సర్పంచ్ శివశం కర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతుల నుంచి భూసమస్యలపై అధికారులు వినతులు స్వీకరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో ఉప సర్పంచ్ రామలక్ష్మన్న, ఎంపీటీసీ పెద్దన్న, ఎస్‌పి పెద్దిరెడ్డి, రామిరెడ్డి, శివశంకరరెడ్డి ఓబులేసు, అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉయ్యాలవాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహి స్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక నాలుగవ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయికి వెళ్లి గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు తీసుకోవలసిన న్యూట్రిషన్ ఫుడ్ గురించి వివరించాలన్నారు.

నేలవాలిన వరి పంట

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తాండ గ్రామంలో ఈదురుగాలుల బీభత్సంతో చేతికొచ్చిన వరి పంట నేలవాలి దెబ్బతింది. నష్టపోయామని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 50 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే విధంగా లేదని విలపించారు. దాదాపు రూ.2.50 లక్షలు నష్టం వాటిల్లింది. అధికారులు స్పందించి నేలవాలిన వరి పంటను పరిశీలించి పరిహారం అందేలా చూడాలని గిరిజన రైతులు కోరారు.

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎరువుల డీలర్లు, పురుగు మందుల దుకాణదారులు కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోగల ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో శాంపిల్స్‌ను సేకరించారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు తస్లీమా సుల్తాన తెలిపారు. శుక్రవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఏ మనోహర్, ఏఎన్ఎం విజయనిర్మల పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

కోవెలకుంట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు శనగసాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. శుక్రవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని అమడాల గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, ఉప్పు రామక్రిష్ణరెడ్డి, అధికారులు క్రిష్ణకుమార్, ధరణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్టేషన్ తనిఖీ


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బనగానపల్లె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏపీ ఎస్పీ డీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా సుధాకర్ కుమార్ శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన బనగానపల్లె సబ్‌స్టేషన్‌ను, విద్యుత్ కార్యాలయాలను తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల తీరును విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీ మద్దిలేటి, విద్యుత్ ఏఈలు శ్రీనివాసులు, గర్జప్ప పాల్గొన్నారు.

తాగు, సాగు నీరు అందించాలి: సీపీఐ

డోన్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు, ప్రజలకు సాగు, తాగు నీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, మోటరాముడు, మండల కార్యదర్శి నారాయణ, వరదరాజులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై అవగాహన ఉండాలి

శిరివెళ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థపై విద్యార్థులు అవగాహన ఉండాలని శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మోడల్ స్కూల్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతులు

రుద్రవరం అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కల్తీ వరి విత్తనాలతో పలువురు రైతులు నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి సురేష్ అన్నారు. శుక్రవారం చిన్న కంబలూరు పంట పొలాల్లో రైతులు సాగు చేసిన వరి పంట పొలాన్ని పరిశీలించారు. వారి వెంట నాయకులు, రైతులు ఉన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

రుద్రవరం అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో దస్తగిరి స్వామి గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. పడమటి వీధిలో ఉన్న దస్తగిరి స్వామి దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మేళతాళాలతో జెండాలను ట్రాక్టర్‌పై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

'చర్యలు తీసుకోవాలి'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ప్రవక్త మహమ్మద్ సల్లలాహు అలైహి వసల్లంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మహమ్మద్ ప్రవక్తపై యతి నరసింహానంద్ చేసిన అభ్యంతకర వ్యాఖ్యలను నిరసిస్తూ ఆళ్లగడ్డ పట్టణంలోని ఈద్గా మసీదు నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ముస్లింలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.

బ్లాస్టింగ్ నిర్వహిస్తే చర్యలు: సీఐ

కొలిమిగుండ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నాపరాళ్ల గనుల్లో పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మట్కా, పేకాట, నాటుసారా తదితర అసాంఘూక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

సంజామల, అక్టోబరు 25: బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీసీ ఇందిరమ్మ అన్నారు. ఈ నెల 24న ఇంజెడు గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పసుపల మహమ్మద్ సోదరుడు పెద్ద అలీఖాన్ నూర్పిడి యంత్రంలో పడి మృతి చెం దాడు. విషయం తెలుసుకున్న ఇందిరమ్మ కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతుని కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో చువ్వల సుబ్బారెడ్డి, పసుపల మహమ్మద్, ముదిగేడు గ్రామ నాయకులు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఒక పాడి గేదె ఎకరా భూమికి సమానం

రుద్రవరం అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఒక పాడి గేదె ఎకర భూమికి సమానమని ఎంపీడీవో భాగ్యలక్ష్మి, తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయం ఆవరణలో 21వ అఖిల భారత పశుగణన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధి నిరంజన్ ప్రతాప్, ఏఈ కమాల్ సాహెబ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

డోన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఉంగరానిగుండ్లలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిన్న మద్ది కుమారుడు మధు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మధు మృతికి పలువురు టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు.